మధురానగర్ ఆరోగ్య కేంద్రానికి సుస్తీ!

- అధ్వానంగా పరిసరాలు
- వైద్యసేవలూ అంతంతమాత్రమే..

మధురానగర్(విజయవాడసెంట్రల్): సామాన్యులకు సైతం వారి ఇంటికి సమీపంలోనే ఆరోగ్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మధురానగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో పేదలకు పట్టణ ఆరోగ్యేంద్రం ద్వారా ఆధునిక వైద్యసేవలు అందించటంతో పాటు ఉచితంగా రక్త పరీక్షలు గతంలో నిర్వహించేవారు. ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యసేవలు సామాన్యులకు దూరం అవుతున్నాయి.

పరిసరాలు అపరిశుభ్రం

ఆరోగ్యకేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. మధురానగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం మెయిన్ గేటు తుప్పుపట్టి అధ్వానంగా మారింది. అలాగే ఇక్కడ ఫ్లోరింగ్ టైల్స్ సైతం పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అయినప్పటికీ కనీసం ఇక్కడ శుభ్రం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యకేంద్రం వద్ద అవగాహన కోసం ఏర్పాటు చేసిన బ్యానర్లు సైతం వెలిసిపోయి ఏం ఉందో తెలియని స్థితికి చేరుకున్నాయి. అయినప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆదివారం అంతే..

ఇక్కడ ఆదివారం ఒక్కపూట మాత్రమే ఆరోగ్యకేంద్రం పనిచేస్తుంది. అలాగే ఆరోగ్యకేంద్రంలో ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ ఇక్కడ ఆదివారం గేటు వేసి ఉంచుతున్నారు. తెలిసిన వారు మాత్రమే గేటు తీసుకుని లోపలకు వెళ్లి వారు ఇచ్చిన మందులు తీసుకుంటున్నారు. తెలియని వారు మాత్రం ఆరోగ్యకేంద్రం మూసి ఉందని తిరిగి వెళ్లిపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఒక్కరు మాత్రమే ఉండటం వల్ల తమ రక్షణ కోసం గేటు తీయటం లేదని అంటున్నారు. గతంలో ఒక్కరు విధులు నిర్వహిస్తున్నప్పుడు ఒక ఆకతాయి వచ్చి హడావుడి చేశారని, అందుకే గేటు తీయటం లేదని చెబుతున్నారు.



మధురానగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం



ఆరోగ్యకేంద్రం వద్ద కట్‌చేసిన చెట్టు దుంగలు



ఫ్లోరింగ్ టైల్స్ పగిలిపోయిన దృశ్యం

ఇన్సులిన్ ఇవ్వటం లేదు



మధురానగర్ ఆరోగ్యకేంద్రంలో అన్ని రకాల మందులు ఉండటం లేదు. కొనిరకాల షుగర్ మాత్రలు మాత్రమే ఇస్తున్నారు. ఇన్సులిన్ బయట కొనుక్కోమని చెబుతున్నారు. అలాగే రక్త పరీక్షలకు సైతం జీజీహెచ్‌కు వెళ్లమంటున్నారు. ఇక్కడ గతంలో మాదిరిగా అన్నిరకాల రక్త పరీక్షలు ఉచితంగా చేయటంతో పాటు ఇన్సులిన్ కూడా అందుబాటులో ఉంచాలి.

– బోను పూర్ణ, మధురానగర్

దేశం గర్వించదగ్గ ఇంజినీర్ కేఎల్ రావు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన డాక్టర్ కేఎల్ రావు భారతదేశం గర్వించదగ్గ ఇంజినీర్ అని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆదివారం గవర్నర్ పేట ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ ఆడిటోరియం వద్ద కేఎల్ రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వర్గీయ కేఎల్ రావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్ రావు కృష్ణా జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. కంకిపాడులో జన్మించిన ఆయన ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పొందారన్నారు. 1961లో తొలిసారి విజయవాడ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారని తెలిపారు. మూడుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహుదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ మంత్రి వర్గాల్లో పనిచేశారన్నారు. కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసి అనేక నీటిపారుదల, జల విద్యుత్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ఆనకట్టలు నిర్మించారన్నారు. పులిచింతల ప్రాజెక్ట్, ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. కేఎల్ రావును ఆదర్శంగా తీసుకుని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గజ్జలకొండ వాసు, ఒబ్బిరెడ్డి వెంకటరామిరెడ్డి, నాయకులు వెన్నం రత్నరావు, చల్ల సుధాకర్, దోనేపూడి శ్రీనివాస్, తాడి శివ, చింత సింహాచలం, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కేఎల్ రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

వృద్ధులను ఆదరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం అని, వారిని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ వైద్యులు డాక్టర్ బీ గిరీష్, డాక్టర్ బీ ప్రవీణ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత రమేష్, సురేష్ సోలంకీ దంపతుల సహకారంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 215 నెలలుగా నిర్విరామంగా వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేయటం అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీ మాట్లాడుతూ తమకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతల మనోభావాలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టీ తట్టి అర్జునరావు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను వివరించారు. అనంతరం ప్రముఖ వైద్యులతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు కె మధుసూదనరావు, పీ లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రోడ్డును బాగు చేయరూ..



ముత్యాలంపాడు మసీదు రోడ్డులో రోడ్డును సరిచేయని దృశ్యం



ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో రోడ్డు దుస్థితి

- యూజీడీ పైపులైన్ పనుల కోసం తవ్వారు
- నెల గడుస్తున్నా సరిచేయని అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్‌లో యూజీడీ పైపులైన్ పనుల కోసం తవ్విన రోడ్డును సరిచేయకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డును తవ్వటంలో చూపించిన శ్రద్ధ.. సరిచేయటంలో చూపించటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ముత్యాలంపాడు యూజీడీ పంపింగ్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ కాలనీ వరకు యూజీడీ కొత్త పైపులైన్ పనులు నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డును తవ్వి కొత్తపైపులైన్ వేశారు. ఇంత వరకు బాగానే ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో యూజీడీ పైపులైన్ పనులు పూర్తయి నెల గడుస్తున్నా ఇంతవరకు రోడ్డును సరిచేయలేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు కుంగి పోయి ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల రోడ్డుపై కంకర లేచిపోయి వాహనాలకు భద్రత కరువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సత్వరమే రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు.

రోడ్డును సరిచేయడం లేదు



ముత్యాలంపాడులో యూజీడీ పనులు పూర్తయి నెల దాటినప్పటికీ రోడ్డును సరిచేయటం లేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే భయంగా ఉంది. వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో దుమ్ముధూళి లేచిపోయి ఇబ్బందికరంగా ఉంది. వర్షం కురిసినప్పుడు బురదగా మారి తరచూ పలువురు పడిపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును వేయాలి

– ఎస్‌కే బాషా, ముత్యాలంపాడు

అదివో.. అల్లదివో శ్రీహరివాసము..

కొనసాగుతున్న అన్నమాచార్యుల జయంతోత్సవాలు

విజయవాడ కల్చరల్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి సందర్భంగా శ్రీవెంకటేశ్వర సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో పలువురు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. కే సరస్వతీ ప్రసాద్, ఎం.ఆముక్త్, ఎం.ఆహ్లాద్, వీవీ రఘురామ ప్రణద, సీతారత్నం బృందం, కొత్తూరి శ్రీరంజని స్వరవాహిని బృందం, చింతలపాటి శ్రీదేవి, ఐశ్వర్య, మోదుమూడి సుధాకర్ శిష్యబృందం, శాంతిశ్రీ బృందం, అయ్యప్పన్, ఎం శ్రవణ్ కుమార్, విఖ్యాత సంగీత విద్వాంసులు కస్తూరి గోపాలరావు, పోపూరి గౌరీనాథ్‌లు అన్నమయ్య రచించిన సంకీర్తనలను మధురంగా ఆలపించారు. అదివో అల్లదివో శ్రీహరివాసము, పలుకు తేనియ తల్లి, చక్కని తల్లకి చాంగ్‌భళా, కట్టెదురా వైకుంఠము తదతర కీర్తనలు చోటు చేసుకున్నాయి. శ్వాస సభ్యులు సత్యబాలు, ప్రసాద్ నిర్వహించారు.



అయ్యప్పన్ సంకీర్తనం



సంగీత విద్వాంసుడు ప్రయోక్త కస్తూరి గోపాలరావు అన్నమయ్య సంకీర్తనం

నేత్రపర్వంగా సంప్రదాయ నృత్యాలు



సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు



జంగం సోదరీమణుల నృత్యవిలాసం

విజయవాడ కల్చరల్: జేఎంఎస్‌యోగభారతి (అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా జీవీఆర్ సంగీత కళాశాల్లో ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యహేల కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. యువ నాట్యాచారిణులు జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ అంశాలను ప్రదర్శించారు. పూర్వంగంతో ప్రారంభించి, నర్తనగణపతిం, జెంజెతనన, అపదరోకు(జావళి) సంచరధర(జయదేవుని అష్టపది), భామాకలాపం, బృందావన నిలయే, కృష్ణశబ్దం, సందెకాడపుట్టి, ముద్దుగారే యశోద, గోవిందాశ్రిత, చేరియశోదకు అంశాలను ప్రదర్శించి మంగళంతో ముగించారు. 40 మంది చిన్నారులు నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విజయకుమార్ మాట్లాడుతూ చిన్నారులకు నృత్యంలో శిక్షణ నిస్తున్న జంగం సిస్టర్స్ కృషిని అభినందించారు.

కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి కాలం మొదలైనప్పటి నుంచి హరివిల్లు ఫౌండేషన్ సేవా సంస్థ ప్రతి ఆదివారం నగరంలోని ప్రధాన కూడళ్లలో దాహార్తులకు మజ్జిగ పంపిణీ సేవ కొనసాగుతుంది. ఆదివారం 38వ డివిజన్ పరిధిలోని రథం సెంటర్‌లో ర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత విజయవాడ అన్న నినాదంతో హరివిల్లు ఫౌండేషన్ నిర్వాహకులు మజ్జిగ పంపిణీకి ప్లాస్టిక్ గ్లాసులు వాడకుండా సంప్రదాయబద్ధంగా స్టీల్ గ్లాసుల్లోనే అందించటం అభినందనీయమని తెలిపారు. తద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు వినూత్న ఆలోచన చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా తాము నిర్వహిస్తున్న ఈ నిస్వార్థ సేవా కార్యక్రమాలను చూసి కొంత మంది దాతలు తమ సహకారాన్ని అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హరివిల్లు ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు.కనకారావు, కోశాధికారి ఎం.రవికుమార్, వీ శేఖర్‌బాబు, బి జంటి, ఇర్షాద్, అప్పలరాజు, కె శ్రీనివాసరావు, పీ త్రినాథ్, నజీర్, మహ్మద్, గురురాజ్, పీ లక్ష్మణరావు, శ్యామల, విజయశాంతి, యష్మిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేరచరిత్ర కలిగిన వారిపై పోలీసుల నిఘా



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక ఎస్‌ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్‌లకు స్టేషన్ ఆవరణలో సీఐ లక్ష్మీనారాయణ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరచరిత్ర కలిగిన ప్రతిఒక్కరిపై పోలీసుల నిఘా ఉందన్నారు. వారు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా నడచుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడి, సస్పెక్ట్ షీటర్లు గత నేర చరిత్రను వదలిపెట్టి సత్ప్రవర్తక కలిగి కుంటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు. అలా కాకుండా వారు ఎద్దైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మట్టిని అమ్మేస్తున్నారు?



పాయకాపురం(విజయవాడరూరల్): అవుట్‌పాల్ డ్రెయినేజీ కాల్వ నిర్మాణం పనుల్లో లభించే మట్టిని అధికారులు, అధికార పార్టీ నాయకులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవుట్‌పాల్ డ్రెయిన్ గోడ నిర్మాణానికి ఐదు అడుగుల లోతు మట్టిని తవ్వి తీయాల్సి ఉంది. ఆ మట్టిని పక్కనే ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు విక్రయించి సొమ్ము రాబట్టుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నాయకులు మట్టిని కూడా వదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ కార్యాలయంలో ఆ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెనాలికి చెందిన పేద ముస్లిం మహిళ షేక్ షాహెదా కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. ఆజాద్ కమిటీ ప్రతి నెలా నిర్వహించే సహాయ కార్యక్రమంలో భాగంగా ఈ నెల తెనాలికి చెందిన షాహెదాకు నిత్యావసర సరుకులను అందజేసినట్లు ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా తెలిపారు. తెనాలి నియోజకవర్గ యిన్‌చార్జి పఠాన్ ఫెరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విషయాలు తెలియజేయాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన అన్ని విషయాలను దేశ ప్రజలకు తెలియజేయడం కేంద్ర ప్రభుత్వ కనీస ధర్మమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.పోలారి అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఈ నెల 20న గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పోలారి మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ సర్కార్ గులాంగిరి చేయడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. మధ్యవర్తిత్వాన్ని ట్రంప్ చేతికి ఇచ్చి దేశ ప్రతిష్టను దిగజార్చిన మోదీ సర్కార్ వైఖరికి నిరసనగా సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.

బెజవాడలో భారీ వర్షం



విజయవాడలో ఆదివారం సాయంత్రం గంటసేపు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారింది. చల్లటి గాలులతో పాటు వర్షం కురవడంతో ప్రజలు కొంత సేదతీరారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న నగరవాసుల చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలకు వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతులపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలో ఉన్న సర్కిల్–2 కార్యాలయం, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో కూడా జరుగుతుందని పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగర వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారిస్తారన్నారు. ఈ అవకాశాల్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా చందనోత్సవం



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధి 16వ డివిజన్ స్క్రూ బ్రిడ్జి సమీపంలోని పాత వీబీఎం కాలేజ్ ఆవరణలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం జగన్నాథస్వామికి చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథుడు చతుర్భుజ మహావిష్ణుగా, బలభద్రుడు అనంత శేషునిగా.. సుభద్రాదేవి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. మామిడి కాయలతో స్వామివారి సింహాసనాన్ని అలంకరించారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదం ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర అధ్యక్షులు చక్రధరిదాస్, ప్రజాదాం దాస్, బలరాం గోవిందదాస్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కళాక్షేత్ర డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నాట్య గురువులు గీత, మౌనికల పర్యవేక్షణలో సుమారు 20 మంది విద్యార్థులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి విద్యార్థులను అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం



వించిపేట(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని పాత శివాలయం ప్రాంగణంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ నటరాజ షణ్ముఖం ఆదేశాల మేరకు వీరభద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు చింతలపాటి సూర్యానారాయణ శాస్త్రి అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు స్వామివార్లకు మామిడి, అరటి పండ్లతో అభిషేకం చేశారు. ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి గణపతి పూజ అనంతరం ఉభయ దాతల చేత స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉభయ దాతలకు, భక్తులకు, స్వామివారికి నివేదించిన మహా ప్రసాదాన్ని అన్న ప్రసాదంగా అందజేశారు.